# బహుమతి

"ఏరా! ఈ ఇంట్రా వీనస్ డ్రిప్ ఇంకా ఎంత సేపురా! చెయ్యి కదపడానికి లేదు. ఈ బాటిల్ ఆయిపోగానే ప్లాస్టరు, నీడిల్ తీసి పారేస్తాను" అంది మీనాక్షి, కొడుకు డాక్టర్ ప్రతాప్‌తో.

"మమ్మీ! నువ్వు మాట్లాడకుండా బుద్ధిగా వుంటే ఇంకో రెండు బాటిల్స్ తర్వాత తీయించేస్తాను" అన్నాడు డా. ప్రతాప్.

"ఊళ్లో ఇన్ని హాస్పిటల్స్ వుండగా బుద్ధి లేక మీ డాడీ నన్ను ఈ హాస్పిటల్లో పడేసేడు, నన్ను నీకు అప్పగించి తను యిష్టమొచ్చినట్లు తిరగొచ్చునని"

"డాడీ సమయస్ఫూర్తిని అభినందించాలి. నీకెంత గండం గడిచిందో నీకు తెలీదు. అయినా మమ్మీ! ఇంట్లో అంతమంది నౌకర్లు చాకర్లు పెట్టుకుని, నువ్వు వొంటింట్లోకెళ్లి స్టౌ వెలిగించి...."

"ఎంతమంది పనివాళ్లుంటే అంత పనుంటుంది. అయినా వీళ్లు సామాన్యులా! పోలీసు జవాన్లు కదా! దొంగల్ని తలదన్నిన దొంగలు! వెయ్యి కళ్లతో కనిపెడుతూ వుండాలి"

"అలా వాళ్లని కనిపెడుతూ వుండడం వల్లనే, నీ చీర అంటుకోవడం కనిపెట్టలేక పోయేవు" అంటుండగా హెడ్ నర్స్, ప్రభావతి వొచ్చి అప్పుడే ఖాళీ అయిన బాటిల్ తీసేసి మరో బాటిల్ తగిలించింది.

"సిస్టర్, ఈమె మా మదర్, మీనాక్షి. కొంచెం ట్రబుల్‌సం పేషెంటు. బిపి, సుగరు కూడా వున్నాయి. ఏమైనా వెర్రివెర్రి వేషాలేస్తే చేతికి క్లాంప్స్ బిగించయినా సరే మొత్తం నాలుగు బాటిల్స్ గ్లూకోశలైన్ ఎక్కించెయ్యండి" అన్నాడు ఆమెతో.

"అలాంటి అవసరమేమీ వుండకుండా నేను చూస్తాను. మీరు నిశ్చింతగా వెళ్లి పని చూసుకోండి" అంది డాక్టర్ ప్రతాప్ భుజం తడుతూ.

"థేంక్యూ సిస్టర్. ఛియరప్, మమ్మీ" అంటూ బయటికి వెళ్లేడు, డాక్టర్ ప్రతాప్.

ఎవరో పరిచయమైన మొహం, స్వరం లాగుందని ప్రభావతిని పరిశీలనగా చూసి, "సిస్టర్, నీ పేరు ప్రభావతి కాదూ?" అని అడిగింది మీనాక్షి.

"అవును.. మీరు.."

"మీనాక్షిని. పాతికేళ్ల క్రితం..."

"మీరు శ్యాంసుందర్ అక్కగారు. మురళీధర్రావుగారి భార్య. అప్పుడాయన సూపర్నెంట్ ఆఫ్ పోలీస్...."

ఇప్పుడు మరి ఐజిపి అయ్యేడు. రెండేళ్లలో రిటైర్ అవబోతున్నాడు"

"ఓ! మిమ్మల్ని చూడడానికేలాగుంది, చాలామంది పోలీసాఫీసర్లు, వాళ్ల భార్యలు వొచ్చి బయట వెయిట్ చేస్తుంటే, డాక్టర్ ప్రతాప్ వాళ్లతో మాట్లాడి పంపించేసేరు."

"ప్రతాప్ మా అబ్బాయి"

"ఇందాకా చెప్పేరు. విన్నాను. ఇంక రెస్ట్ తీసుకోండి"

"నీతో ఓ నిముషం మాట్లాడాలి"

"మేడం! ఇది ఇంటెన్సివ్ కేర్ యూనిట్. రేపు మిమ్మల్ని స్పెషల్ రూంలోకి మార్చిన తర్వాత"

"జస్ట్‌వన్ మినిట్. మీ అమ్మ బాగుందా? పేరేమిటి, మరిచిపోయేను"

"కామేశ్వరి.... బాగుంది."

"ఒక్కసారి నన్ను కలవమంటావా!"

"అలాగే"

"ప్రామిస్?"

"మీరు పోలీసాఫీసర్ భార్య. నేను మాట తప్పితే బతకనిస్తారా!" అంటూ చరచరా బయటకెళ్లిపోయింది. ప్రభావతి అన్న మాటల్తో మీనాక్షి మెదడులో ఏదో జ్ఞాపకం కలుక్కుమని, ఆలోచనలో పడింది.

★ ★ ★

దుర్గాబాయ్ శరణాలయంలో కామేశ్వరి నలభయ్యేళ్లుగా ఆయాగా ఉంటోంది. ఆమె రిటైరై అయిదేళ్లయినా, యాజమాన్యం నుంచి జీతం బత్తెం ఆశించకుండా, అనాథ

పిల్లలకి సేవచేస్తూ, శరణాలయంలోనే వుంటూ అందరి ఆదరాభిమానాల్ని చూరగొంది. ఎప్పుడైనా ఒక రోజో రెండ్రోజులలో కూతురు ప్రభావతి, యింటి కెళ్లినా, ముళ్ల మీద వున్నట్టుండి వొచ్చేస్తుంది. ఆ పిల్లల యడల ఆమె పెంచుకున్న అనుబంధం అలాంటిది.

రెండు కార్డ్‌బోర్డ్ బాక్సెస్‌తో, ఆటో దిగుతున్న ప్రభావతిని కిటికీలోంచి చూసి, శరణాలయం మేట్రస్ లీలావతి, తన ఆఫీస్ గది తలుపు తీసుకుని బయటకొచ్చి ఎంతో ఆప్యాయంగా పలకరించి లోపలికి తీసుకెళ్లింది.

"ఏదో పేరు చెప్పి నెలకోసారైనా పిల్లల కోసం స్వీట్స్ తెస్తూ ఉంటారు. ఇవ్వాళ శలవు రోజు కాదు, పండగ కాదు. ఏమిటీ విశేషం?" అడిగింది లీలావతి.

"ఇవాళ మా అమ్మ పుట్టిన రోజు."

"గుడ్ హెవెన్స్. కామేశ్వరమ్మ పుట్టిన రోజా! అవును సుమా! అసలు మేమే సెలబ్రేట్ చెయ్యాలి. మాకు గుర్తులేదు, మీరు గుర్తుచెయ్యరు. అయితే ఇవ్వేళ మీ అమ్మని చూసిరావడానికి కాకుండా, యింటికి తీసుకెళ్లడానికొచ్చేరన్నమాట!" అంది.

"తీసుకెడదామన్నారాదుగా! నిరుడలా తీసుకెళ్లినందుకు కోప్పడింది. ఇంక ఆమెకి భూమ్మీద నూకలున్నన్నాళ్లూ ఈ శరణాలయమే స్థిర నివాసం" అంది ప్రభావతి.

"అది మా అదృష్టం. ఏం చేసినా ఈ శరణాలయం ఆమె రుణం తీర్చుకోలేదు, మీ రుణం తీర్చుకోలేదు."

"నిజం చెప్తాను. ఈ వ్యాపకమే లేకపోతే మా అమ్మ ఈ వయస్సులో ఇంత ఆరోగ్యంగా, ఇంత ఉత్సాహంగా వుండివుండదు. వెళ్ళోసారి పలకరించొస్తాను."

"వెళ్లండి ఆ లాన్‌లో పిల్లలతో ఆడుకుంటూ వుంటుంది." అంది లీలావతి నవ్వుతూ.

చీర ఒళ్లో పెట్టి పాదాలకు నమస్కరించిన ప్రభావతిని చూసి నిర్ఘాంతపోయింది తల్లి కామేశ్వరి. సంగతి సందర్భం విశదీకరించి, "ఈ చీర నువ్వు కట్టుకో. ఎవరికీ ఇచ్చెయ్యకు. నీ ఫ్రెండ్స్, ఆ యిద్దరి ఆయాలకీ వొంట వాళ్లకి, నీ పేరు చెప్పి బట్టలు యిస్తాను. పిల్లలకీ పళ్లూ, స్వీట్లూ లీలావతిగారి చేతికిచ్చేను" అని చెప్పి ఆమె దీవనలందుకుంది.

"నా పుట్టిన రోజని నాకే జ్ఞాపకం లేదు అయినా"

"సరే కాని, మీనాక్షిగారు జ్ఞాపకముందా?"

"శ్యాంసుందర్ మేనత్త. శ్యాం తండ్రిని వెంటబెట్టుకుని నీ దగ్గర కొచ్చింది...."

"ఆఁ పోలీసాఫీసర్ భార్య. నన్ను దుబాయ్ పంపిచెయ్యడానికి లక్ష రూపాయలిచ్చింది..."

"శ్యాం తండ్రి చేత నీకిప్పించింది"

"నేను వొద్దంటుంటే ఆయన చేతిలోంచి సంచీ తీసుకుని నా చేతిలో బలవంతంగా పెట్టి, "నీ మంచి కోసం చెబుతున్నాను. ఈ డబ్బుతో నీ కూతుర్ని దుబాయ్ పంపించెయ్యి. మళ్ళీ శ్యాంతో నీ కూతురు కలిసినా, ఫోన్లో మాట్లాడినా దాని ప్రాణాలు దక్కవు" అని బెదిరించింది"

"ఆఁ... ఆవిడే, మా హాస్పిటల్లో ఎడ్మిటయింది. నిన్నోసారి కలవాలంటుంది. రెండ్రోజులు పోయింతర్వాత వొచ్చి తీసుకెడతాను"

"నన్నెందుకు కలవడం!" అంది కామేశ్వరి చిరాగ్గా.

"లక్ష రూపాయిలిచ్చింది కదా! ఓ సారి కలిసి మాట్లాడితే మర్యాదగా ఉంటుంది. కలవకపోతే అదో నిష్ఠూరం" అంది ప్రభావతి.

★ ★ ★

కామేశ్వరనే ముసలావిడ తనని చూడ్డానికొచ్చిందని తెలిసి, గదిలో వున్న విజిటర్సందర్నీ పంపించేసింది మీనాక్షి. స్పెషల్ వార్డులో గది తలుపులు తీసుకుని నెమ్మదిగా లోపలికెళ్ళి నిలబడింది కామేశ్వరి.

"బాగున్నావా, కామేశ్వరీ! ఇలా కూర్చో" అంది మీనాక్షి.

"ఫర్వాలేదు, ఇలా నిలబడతాను. రమ్మన్నారుట!" అంది.

"ముందు, ఇలా ఈ కుర్చీలో కూర్చో నీతో మాట్లాడాలి" అని పట్టు పట్టగానే కూర్చుంది కామేశ్వరి.

"ఊఁ మా మీద కోపం పోయిందా?"

"పేదోళ్ల కోపం పెదవికి చేటంట... మాకు కోపం ఏమిటమ్మా, ఉంటే దుఃఖం ఉంటుంది. దాన్ని మా మొకాన్న దేవుడే రాశాడని సరిపెట్టుకోవడానికి అలవాటు పడ్డవాళ్లం"

"అవును, ప్రభావతి దుబాయి నుంచి ఎప్పుడు తిరిగొచ్చింది?"

"దుబాయ్ యెప్పుడెల్లింది! మీ యన్న సేకరంగోరు పెద్ద యాపారస్తుడు, మీవోరు పోలీసాఫీసరు కధా! అప్పుడు యిద్దరూ కూడబలుక్కుని ప్రభావతిని సెంట్రల్ జైలు ఆసుపత్రిలో నర్సుగా వేయించి రెండు నెలలు తొక్కి బెట్టేసేరు. ఇక్కడేమో అది ఎవడితోనో లేచిపోయి, దుబాయెల్లి పోయిందని పోలిసోళ్లతో శ్యాంసుందరంగోర్కి చెప్పించేరు. పాపం! శ్యాంసుందరంగోరు రోజూ నా దగ్గిర కొచ్చి, దుబాయ్ నుంచి ఫోనొచ్చిందా? ఎడ్రసేంటి? ఎవరితోనో లేచిపోవడం నిజమేనా అడి అడిగీవోరు. నిజం చెబితే నా కూతుర్ని చంపేస్తానని పోలీసులు బెదిరించీవోరు. అంచేత పోలీసులికి బయపడి ఆయబ్బాయిగార్కి అబద్ధం చెప్పేను. రెండు నెలలు తర్వాత ఆ బాబు పెళ్లి చేసుకుని అమెరికా వెళ్లిపోయేడని తెలిసింది" అంది కామేశ్వరి, పాతికేళ్లక్రితం జరిగిన కథంతా జ్ఞాపకం తెచ్చుకుని.

"ఇదంతా నాకు తెలియదు. ప్రభావతిని దుబాయ్ పంపించేశామని నాకు చెప్పేరు" అంది మీనాక్షి ఆశ్చర్యంగా.

"రెండు నెలల తర్వాత, అందుకే లాగుంది ప్రభావతిని బెదిరించి వొదిలేసేరు. అక్కణ్ణుంచి వరంగలెల్లిపోయి మరో ఆసుపత్రిలో చేరింది."

"మా అన్నయ్య శేఖర్, నేనూ నిన్ను కల్సుకున్నప్పుడు నువ్వో మాటన్నావు గుర్తుందా? పాతికేళ్లయిపోయిందనుకో!"

"నా కూతురేమీ మీ అబ్బాయెనకపడలేదు. కారు బోల్తా పడి మీ యబ్బాయి రెణ్ణెల్లు ఆసుపత్రిలో వున్నప్పుడు స్నేహమయింది. ఆ తర్వాత ప్రేమా, పెళ్లి, అమెరికా తీసుకపోతాను, కాగితాలు, డబ్బు అంతా రెడీ చేశాను అంటూ మీ అబ్బాయే ప్రభ యెనక పడ్డాడు అన్నాను."

"అవును. అంతా పగడ్బందీగానే చేశాడు. పాస్‌పోర్ట్, వీసా, రెడీ చేసుకోవడం, పోలీసాఫీసర్ కదా, మా ఆయనకి తెలిసింది. దాంతో కథ అడ్డం తిరిగింది. అది సరే అప్పుడు నువ్వింకో మాటన్నావు, గుర్తుతెచ్చుకో"

"గేపకం లేదమ్మా... పాతికేళ్ల క్రితం కథ కదా!"

"మా రెక్కల కష్టాల మీద ఏ చీకూ చింతా లేకుండా బతుకుతున్నాం. మీ పిల్లాడికి బుద్ధి చెప్పుకోండి. మధ్య నా కూతుర్ని ఊర్నించి బయటకెందుకు గెంటేస్తారు! అన్నావు.

అప్పుడే ఓ పోలీసు జవాను నిన్ను లాఠీతో కొట్టేడు. నేను అడ్డం పడ్డాను. మా వుసురు తగిలి నాశనమైపోతారు అన్నావు."

"అనే వుంటాను. నేనూ ఓ మనిషినే కందా!"

"మీ వుసురే తగిలిందనుకుంటా. మా అన్నయ్య వ్యాపారంలో దివాళా తీసేడు. శ్యాంకు ఓ కోటీశ్వరుడి పిల్లనిచ్చి పెళ్లి చేసేడు. వాళ్లకి పిల్లల్లేరు. గత్యంతరం లేక పెళ్లయిన రెండేళ్ల తర్వాత శ్యామూ, అతని భార్య యిక్కడి కొచ్చి అనాథాశ్రమంలో ఓ యాడాది పిల్లని దత్తత చేసుకుని అమెరికా తిరిగిపోయేరు."

"అదేంమాటమ్మా! మేం బాగుండాలని కోరుకుంటాం. కాని ఇంకోళ్లు పాడవాలని కోరుకునే యదవాలోచన నాకు లేదు. ఏదో కోపంలో శాపనార్థాలెట్టుగుంటాం"

"నేను మాత్రం నీ మాటలు మరిచిపోలేదు. ఎంచేతనంటే ఇందులో నా పాత్ర వుంది. వీళ్లిద్దరి ప్రేమ వ్యవహార రహస్యం నాకు తెలుసు. శ్యాం చెప్పేడు. కాని ఆ రహస్యం బయటపడింతర్వాత పరిస్థితులు మారిపోయేయి. అధికార బలంతోనూ, ధనమదంతోనూ మా అన్నయ్య, మా ఆయన ఎంత దారుణానికైనా తెగించే ఘనులు. అందుకే గత్యంతరంలేక, నువ్వు వొద్దన్నా నీ చేతుల్లో లక్షరూపాయలు పెట్టేను, పాప పరిహారంగా. అవును ప్రభావతికి పెళ్లయిందా?"

"అయింది."

"ఎప్పుడు?"

"వరంగల్లో వుండగానే.. అదంతా ఓ కథ... ప్రేమించుకున్నారు, పెళ్లి చేసుకున్నారు... అక్కడే చాలా కాలం వున్నారు. పదిహేనేళ్ల క్రితం యీ వూరు తిరిగొచ్చి, యిద్దరూ ఈ ఆసుపత్రిలోనే పన్జేస్తున్నారు"

"మీ అల్లుడేం చేస్తున్నాడు? డాక్టరా?"

"కాదు. అదేదో మంచుద్యోగమే. పేరు మదుసూదను"

"పిల్లలా?"

"ఒక పిల్లాడు. మెడికల్ మూడో యేడు చదువుతున్నాడు."

"చాలా అదృష్టవంతులు. ఆ లక్షరూపాయలు కొంతవరకూ అయినా మీకు ఉపయోగపడినందుకు సంతోషంగా ఉంది."

"వరంగల్ కెళ్లే ముందే ఆ లక్షరూపాయిలు దుర్గాబాయి శరణాలయానికిచ్చేసి, రసీదు మీ అన్నగారికి పంపింది ప్రభ"

మీనాక్షి నిర్ఘాంతపోయి, ఒక్కక్షణం అవాక్కయిపోయింది. అదే అదను చూసి కామేశ్వరి మెల్లగా జారుకుంది.

★ ★ ★

లిఫ్ట్ దగ్గిర కొచ్చేటప్పటికే, డ్రైవర్, పళ్లబుట్ట, శుభలేఖల కట్ట వెంట తీసుకొస్తుండగా, షట్టరు తెరుచుకుని మీనాక్షి బాల్కనీలో కొచ్చింది. ప్రభావతి ఎదురెళ్లి తన ఫ్లేట్‌లోకి సగౌరవంగా ఆహ్వానించి తీసుకెళ్లింది. టూ బెడ్‌రూం ఫ్లేట్ అయినా, విశాలంగా చక్కని హంగులతో ఆకర్షణీయంగా వుండడం చూసి మీనాక్షి, ప్రభావతి అభిరుచిని అభినందించింది. "నా పెళ్లి శుభలేఖ యిచ్చి మిమ్మల్ని ఆహ్వానించడానికి మా మమ్మీ మీ యింటికొస్తుందని డాక్టర్ ప్రతాప్ ఫోన్ చేసినప్పుడు 'మిమ్మల్నెందుకు శ్రమపెట్టడం, హాస్పిటల్లోనే మా కివ్వచ్చుగా!' అన్నాను" అంది ప్రభావతి.

"మీరంటే మాత్రం, యింటికొచ్చి మిమ్మల్ని పిలవడం నా ధర్మం. మా ప్రతాప్ ఏమన్నాడో తెలుసా! నువ్వు కేవలం అక్కడ హెడ్‌నర్స్‌వే కాదు, తనలాంటి ఎంతో మంది జూనియర్ డాక్టర్లకి, క్రమశిక్షణ విషయంలో గురుతుల్యురాలివి అన్నాడు"

"వెరీ కైండాఫిం. అదిసరే, ఒక నిజం చెప్పండి. నాకూ శ్యాంకి మధ్య వున్న ఒకనాటి ప్రేమ వ్యవహారం మీ అబ్బాయికి తెలుసా?"

"తెలియదు, తెలియనివ్వను, నా మాట నమ్ము"

"థేంక్స్. శుభలేఖ మీద నాపేరూ, మా ఆయన పేరూ కూడా వేసేరే!"

"మీ ఆయన పేరు మధుసూధనురావనీ, ఇక్కడ ఛీఫ్ ఫార్మసిస్టనీ, మీ అబ్బాయి, కిశోర్ మెడిసిన్ చదువుతున్నాడనీ యింకా చాలా విషయాలు తెలుసుకున్నాను చాలా అదృష్టవంతురాలివి. వాళ్లింట్లో లేరా?"

"మధు బయటకెళ్లేడు. కిశోర్ హాస్టల్లోనేవుంటున్నాడు."

"మరి మీరిద్దరూ తప్పకుండా రావాలి."

"తప్పకుండా వస్తాం. ఇంపోర్టెడ్ పెళ్లి కూతురు, పెళ్లనగానే తనని వెంట బెట్టుకుని స్టేట్స్‌కి వెళ్లిపోతుందనీ ప్రతాప్ చెప్పేరు"

"పెళ్లికూతురెవరో తెలుసా! ఒకనాటి నీ బోయ్‌ఫ్రెండ్ శ్యాం కూతురు, పేరు శాంతి"

"శ్యాం కూతురా!" అంటూ సంభ్రమాశ్చర్యాలతో శుభలేక తీసి చదువుకుంది.

"శాంతి అక్కడసాఫ్ట్ వేర్ ఇంజనీర్‌గా మంచి పొజిషన్‌లో వుంది"

"అలా చెప్పండి, కోటీశ్వర్లతో సంబంధం" అంది ప్రభావతి, నోటితో ఆలోచిస్తూ.

"నువ్వలా ఆక్షేపించడం సహజమే. కాని నేను మా అన్నయ్య శేఖరంలాగ డబ్బు మనిషిని కాను"

"రక్తసంబంధం కదా!" అందిఅదే వ్యంగ్య ధోరణిలో.

"శేఖరం నాకు వరసకు అన్నయ్య కాని ఒక తల్లి పిల్లలం కాము. శాంతి చాలా అందమయింది, తెలివయింది, బుద్ధిమంతురాలు! శాంతి, ప్రతాపుమొదటి చూపులోనే యిష్టపడ్డారు. అలా వాళ్ల పెళ్లి నిశ్చయమైంది"

"అలాగా! అనాలోచితంగా ఏదో అనేసేను, క్షమించండి. డాక్టర్ ప్రతాప్ తగ్గపిల్లని చూశారన్నమాట! చాలా సంతోషం. తప్పకుండా పెళ్లికి రావాలనే వుంది.. కాని..."

"మా ఆయన మురళి గురించి ఆలోచిస్తున్నావా! మిమ్మల్ని గురించి పట్టించుకోడు. మినిస్టర్లకీ, విఐపీలకీ మర్యాదలు చెయ్యడంలో బిజీగా ఉంటాడు ఫర్గెటిట్"

"ఆనందోత్సాహాలతో వుంటున్న శ్యాం కంటబడి అతనిలో పాత జ్ఞాపకాలతో అలజడి కలిగించడం నా కిష్టం లేదు"

"అవును. నా కర్థమయింది వాడు ఆవేశపరుడు. అందుకే నువ్వు వాణ్ణి చూసినా, వాడు నిన్ను చూడకుండా, మీరిద్దరూ వొచ్చి వధూవరులను ఆశీర్వదించే సమయంలో వాణ్ణి పక్కకి తీసుకెళ్లి మాటల్లో దింపుతాను. ఆ బాధ్యత నాది."

"ఇన్ని హామీలిచ్చి, ఇంత ప్రేమతో ఆహ్వానిస్తుంటే రాకుండా ఉండగలమా!" అంది ప్రభావతి.

★ ★ ★

"శ్యాం" అన్న పిలుపు విని, మార్నింగ్‌వాక్‌లో తనని దాటి వెళ్లి ఆనవాలు పట్టి నాలుగడుగులు వెనక్కి వేసి, తన ఎదురుగా చిరునవ్వుతో నిలబడింది ఎవరా అని కళ్లజోడు సవరించుకుని "ప్రభా" అంటూ సంభ్రమాశ్చర్యాలతో నిలబడిపోయేడు శ్యాంసుందర్.

"అమెరికా నుంచి ఎప్పుడొచ్చేవు?" అడిగింది ప్రభావతి.

"పదిహేను రోజులయింది. మా డాడీ పోయేరు. ఎల్లుండి బయల్దేరి తిరిగెళ్లిపోతున్నాను. అదిసరే, నన్నానవాలు పట్టేవే! జ్ఞాపకమున్నాన్నమాట! ఇప్పుడిక్కడేం చేస్తున్నావు?"

"దుర్గాబాయ్ శరణాలయంలో ఆనరరీ వార్డన్‌గా వుంటున్నాను"

"అంటే దుబాయ్ నుంచి తిరిగొచ్చేసి ఇక్కడ సెటిలైపోయేవన్నమాట"

"దుబాయ్ లేదు ముంబాయ్ లేదు. అదంతా ఓ కథ. మీ అమ్మాయ్ శాంతికి కొడుకు పుట్టేడని తెలుసు, తర్వాత మళ్లీ పిల్లలా?"

"శాంతికా! మా అమ్మాయి నెలా ఎరుగుదువు?"

"అది చెబితినే కాని యిది చెప్పవా?"

"ఇన్నేళ్లొచ్చినా, నీ పెంకితనం పోలేదు. శాంతికి పదేళ్లకొడుకు, ఏడేళ్లకూతురు, ఇప్పుడు నా ప్రశ్నకి జవాబు చెప్పు"

"పన్నెండేళ్ల క్రితం శాంతిని డాక్టర్ ప్రతాప్‌కిచ్చి పెళ్లి చేశావు కదా! ఆ పెళ్లికి నేనూ, మా ఆయనా వొచ్చేం"

"వాట్! ఇక్కడే వుండి పెళ్లికొచ్చి నన్ను పలకరించకుండా మళ్లీ మాయమయ్యేవా! నాతో ప్రేమ కలాపాలు సాగించి, ఇంకోకడితో లేచిపోయి...."

"స్టాపిట్. నీకు ఆవేశం ఎక్కువ. ఇది నలుగురూ వొస్తూ పోయే నడి రోడ్డు. పైగా నీకు బైపాస్ సర్జరీ కూడా అయింది?"

"నీకెలా తెలుసు?"

"మీ అక్కయ్య మీనాక్షి గారి ద్వారాఅన్నీ తెలిసేయి. ఆమె పోయిన తర్వాత మీ క్షేమసమాచారాలు తెలియవు. ఇన్నాళ్లకి మళ్లీ కలుసుకున్నాం. ఇక్కడికి మా యిల్లు అట్టేదూరం లేదు. నెమ్మదిగా కబుర్లు చెప్పుకుంటూ నడిచివెడదాం"

"అంతకంటేనా! కాని రోడ్ చూస్తే అంతా ఎత్తు ఎక్కాలి లాగా కనపడుతుంది."

"నా చెయ్యి పట్టుకుంటే సునాయాసంగా నడువగలవు. తిరిగొచ్చేటప్పుడు నిన్ను మా కార్లో డ్రాప్ చేస్తాను. సరేనా!"

"పద, ఒద్దన్నా లాక్కెళ్లే సమర్థురాలివి" అంటూ చెయ్యి జాపేడు.

"ఊఁ.... అలాగా! ఎవరు ఎవర్ని ఏ స్థితికి లాక్కెళ్లేరో తెల్సుకుందువుగాని" అంటూ తన చెయ్యి అందించింది.

★ ★ ★

శ్యాంని వెంటబెట్టుకు వచ్చేటప్పటికి మధుసూధన్ సోఫాలో కూర్చుని పేపర్ చదువుకుంటున్నాడు.

"హలో! మధూ.... ఇతను నాకు గుడ్ ఓల్డ్ ఫ్రెండ్ శ్యాంసుందర్" అంటూ ప్రభావతి పరిచయం చేసింది నవ్వుతూ.

"నైస్ టు మీట్ యు... గుడ్ ఓ... ఓ.. ఓ.. ఓల్డ్ ఫ్రండంటే.. ఆ శ్యామ్‌సుందర్ గారేనా!" అన్నాడు మధు.

"ఆ దౌర్భాగ్యుణ్ణి నేనే.. సో యు ఆర్ దట్ గ్రేట్ గయ్! మీ విశాల హృదయం, మీ ప్రేమ వ్యవహారం అంతా ప్రభ వివరించింది. మిమ్మల్నిద్దర్నీ యిలా కలవనంతకాలం ఎన్నో శాపనార్థాలు పెడుతూనే వున్నాను" అన్నాడు శ్యాం.

"నిజం తెలియక పెట్టిన శాపాలన్నీ ఆశీస్సులైపోతాయి" అంది ప్రభావతి.

"మిమ్మల్ని కలవలేదు కాని, డాక్టర్ ప్రతాప్ పెళ్లిలో దూరాన్నించే మిమ్మల్ని చూపెట్టి పరిచయం చేసింది ప్రభ"

"అలా అప్పుడు కలవనందుకు దారి పొడుగునా తిడుతూనే వున్నాడు. మీరిద్దరూ మాట్లాడుకుంటూ వుండండి. శ్యాం! నువ్వేమయిపోయేవోనని కంగారుపడుతూ వుంటారు, ఇంటికి ఫోన్ చెయ్యి. నేను కాఫీ కలిపి పట్టుకొస్తాను" అంది ప్రభలోపలికెళ్లింది.

"కాఫీతో సరిపెట్టకు. శ్యాంగార్ని లంచ్‌కి పిలుస్తున్నాను. నీ చేతి వంట రుచి చూస్తారు" అన్నాడు మధు, ప్రభకి వినపడేలాగ.

"నర్సులు వంట కూడా చేస్తారా!" అన్నాడు శ్యాం.

"ఇంకా నయం! పిల్లల్ని కూడా కంటారా! అనలేదు" అంది ప్రభ అది విని బయటికొచ్చి.

"కావాలంటే కనగలరు, అక్కర్లేదంటే మానెయ్యగలరు" అన్నాడు శ్యాం పేపర్ చాటున తల దాచుకుంటూ.

"వంటయినా అంతే, మధూ! శ్యాంని మనింటికి భోజనానికి పిలిచే అదృష్టం లేదు. శ్యాం తండ్రి పోయేరు. ఈ రోజు పదకొండోరోజు, రేపు పన్నెండో రోజు. మళ్లీ రేపు సాయంత్రం స్టేట్స్‌కి తిరిగెల్లిపోతున్నాడు." అంది ప్రభ, లోపలికెడుతూ.

"అయామ్ సారీ...." అంటూ చెప్పబోతున్నాడు మధు.

"ఇటీజ్ ఆల్‌రైట్. రెండేళ్లలో మరోసారి రావాల్సుంటుంది. మా నాన్నగారి వ్యాపారంతాలూకు లావాదేవీలు సెటిల్ చెయ్యడానికి. ఐ హోప్ ఫర్ బెటర్ లక్ నెక్స్ట్ టైం."

"మీ ప్రోగ్రాం ముందుగా రాయండి. వొచ్చే యేడు మేము స్టేట్స్‌కి వెళ్లి రెండు మూడు నెలలలుండేలాగా ప్లాన్ చేస్తున్నాం. మా అబ్బాయి, కోడలు, యిద్దరూ డాక్టర్లే, అక్కడికి రమ్మని ఒకటే పట్టు పడుతున్నారు" అన్నాడు మధుసూధన్.

★ ★ ★

శ్యాం దగ్గర్నుంచి పాతికవేల డాలర్లు దుర్గాబాయ్ శరణాలయానికి విరాళం అందిన రోజున ఈ శుభవార్త చెప్పడానికి ప్రభ, మధు, వయోభారంతో ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న ఒక నాటి వార్డెన్ లీలావతిగారిని కల్సుకున్నప్పుడు ఆమె ఆనందాశ్రువులు రాల్చింది. శ్యాం హైదరాబాద్ రావడం, తలవని తలంపుగా కలవడం, తమ యింటికి రావడం, తిరిగి వెళ్లేటప్పుడుతను త్రోవ మళ్లించి శరణాలయానికి తీసుకెళ్లడం, అభివృద్ధి పథకాలు, నిధులకొరత గురించి ప్రస్తావించడం జరిగిందని ప్రభ చెప్పింది.

"ఇదంతా మీ యిద్దరి పుణ్యం, త్యాగఫలం" అభినందించింది లీలావతి.

"మీ స్నేహం, మీ సహాయం వల్లనే సాధ్యమైంది." అంది ప్రభ.

"నీ కథంతా తెలిసిందాన్ని కనక, శాంతి భవిష్యత్తు దృష్టిలో వుంచుకుని, దత్తత కథ నడిపించేను."

"ఇది దత్తత కాదు మేడం. శాంతి మా యిద్దరి ఉమ్మడి సొత్తు. నా భాగం హక్కు వొదులుకుని కన్నకూతుర్ని కన్నతండ్రికి బహుమతిగా యిచ్చేను" అంది ప్రభ.

"మరి యిప్పుడేమైనా ఈ రహస్యం శ్యాంకి తెలుసా?"

"తెలియదు." అన్నాడు మధు.

"బంధాలు తెంచుకున్న ఈ వయస్సులో పెంచుకుని ఈ ఆనందాన్ని కలుషితం చెయ్యం" అంది ప్రభ.

** రచన, నవంబరు, 2002*